క్లుప్తంగా

నాణ్యమైన ఆహారం, విద్యాబోధన అందించాలి



బాలుర వసతి గృహంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలోని బాలలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు మెరుగైన విద్యాబోధన చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని బాలురకు కల్పించే సౌకర్యాలపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆహారపదార్థాల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సూపరింటెండెంట్ మురళీధర్, సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

30 కిలోల రాగివైరు చోరీ

ఏలూరు టౌన్: దుగ్గిరాల పంచాయతీ పరిధిలో ఒక పొలంలో ఉన్న 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 30 కేజీల రాగి వైరు చోరీకి గురైంది. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుగ్గిరాల పంచాయతీ పరిధిలో చింతమనేని శ్రీరంగ సతీష్ కుమార్ పొలంలో విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది. ఈనెల 5న గుర్తు తెలియని దొంగలు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి 30 కేజీల రాగి వైరు చోరీ చేశారు. దీనిపై విద్యుత్ శాఖ విజయరాయి ఏఈ పి.శ్రీనివాస్ ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. రాగి వైరు విలువ సుమారు రూ.1,30,000 ఉంటుందని అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేకాట, కోడిపందేల శిబిరంపై దాడి

పెదవేగి : కోడిపందేలు పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం పెదకడిమిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పినకడిమిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కూచింపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1000 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విజయరాయిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, కవ్వగుంటలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి, రూ.2,700 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

ఏలూరులో రూ.3.50 కోట్ల పనులకు శ్రీకారం

- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే ఆళ్ల నాని



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని 8, 9, 10, 22 డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ.3.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయన శ్రీకారం చుట్టారు. ఏలూరు వన్‌టౌన్ 8వ డివిజన్ జిల్లెళ్లమూడివారి వీధి, 9వ డివిజన్ ఏడు కాలువల రోడ్డు, 10వ డివిజన్ కల్పన టాకీస్ రోడ్డు, 22వ డివిజన్ సత్రంపాడు సచివాలయం–2 ప్రాంతంలో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి నిధులు కేటాయించి అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో రూ.31 కోట్ల గడపగడపకు నిధులతో పనులను చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్‌కుమార్, సబ్బన శ్రీనివాస్, పైడి భీమేశ్వరరావు, హిస్టరీ అకాడమి డైరెక్టర్ ఎండీ ఖైసర్, క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రోఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో దేవదాయ శాఖ డీసీ



దేవదాయ శాఖ డీసీ విజయరాజుకు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



శ్రీరామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం విజయరాజు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకుడు ఆయనకు వేద ఆశీర్వచనం పలుకగా ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆయన వెంట దేవదాయ శాఖ ఏలూరు జిల్లా అధికారి సీహెచ్ రంగారావు, ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బీఎల్ నరసింహారావు ఉన్నారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. శ్రీ సుదర్శన నారసింహేష్టి, స్వామి నిత్య కల్యాణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నగరానికి చెందిన చల్లపల్లి సుభద్రాదేవి శిష్య బృందం నిర్వహించిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి (జూనియర్ ఉషశ్రీ) శ్రీమద్రామాయణ మహత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నగరానికి చెందిన అభయాంజనేయ స్వామి నాట్యకళా మండలి ఆధ్వర్యంలో టీసీహెచ్ నాయుడు బృందం ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన విశేషంగా అలరించింది. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు టౌన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులకు కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ముడిచర్ల పావని గంగకు గతేడాది మే 11న రాజమహేంద్రవరానికి చెందిన దాసమూరి వెంకట దుర్గారావుతో వివాహం అయింది. వివాహ సమయంలో రూ.12.50 లక్షలు నగదు, 10 కాసుల బంగారు ఆభరణాలు సారెగా ఇచ్చారు. భర్త అదనపు కట్నం కోసం పావని గంగను వేధించడంతో వెంకట దుర్గారావుపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అవినీతి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కలిగించాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు కోరారు. అవినీతి నిరోధక వారోత్సవాలు సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ఏలూరు అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ భాస్కర రావు, ఇతర అధికారులను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్‌ను ప్రజలు ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర శాఖలలో ప్రజలకు న్యాయమైన సేవ చేయాలని, అవినీతికి తావు లేకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవలు పొందేలా చూడాలని, అవినీతి చేస్తూ పట్టుబడిన అధికారులను కఠినంగా శిక్షించి వారిని పూర్తిగా విధుల నుంచి తొలగించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సౌకర్యాలు రాకుండా చట్టాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ బత్తిన శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జిలు రాపాక మోహన్‌రావు, జలసూత్రం వెంకటరమణ, సీహెచ్ శ్రీలత, ఎస్ కుమార్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలి



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దిశ ఇన్‌స్పెక్టర్ విశ్వం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు, బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులు పంపే లింకులను లేదా సందేశాలను ఓపెన్ చేస్తే మన రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం హెచ్చరించారు. స్థానిక ఆదివారపుపేటలో ఉన్న ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) హైస్కూల్‌లో ఉన్న విద్యార్థినులతో దిశ యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలను దిశ మహిళా ఎస్సై కాంతి ప్రియతో కలిసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకొచ్చిన కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటోందని, దాని వల్ల ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోయినట్లు, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ప్రపంచంలో జరిగే వింతలు, విశేషాలను తెలుసుకోవడంలో తప్పు లేదని చెప్పారు. ప్రతి ఒక్కరు ఫోన్లో దిశ యాప్ కలిగి ఉండాలన్నారు. ఆపదలో ఉన్న బాధితులు దిశ యాప్ కలిగి ఉంటే పోలీసు వారు తమ వెంట ఉన్న భరోసా కలుగుతుందని ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 112, డయల్ 100 ఫోన్ చేసిన వెంటనే పోలీసులు 10 నిమిషాల్లో బాధితుల చెంతకు చేరుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీజీకే స్కూల్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోణంగి శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు



పోణంగిలో శ్మశాన ఆక్రమణపై ఫిర్యాదు చేసిన రామకృష్ణ

ఏలూరు రూరల్: పోణంగి హిందూ శ్మశాన వాటిక ఆక్రమణను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. పోణంగి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఉపయోగిస్తున్న శ్మశాన స్థలాన్ని కొందరు రాత్రివేళ యంత్రాలతో దొంగచాటుగా చదును చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమార్కులు స్థలంపై తప్పుడు పత్రాలు సృష్టించి అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారని వివరించారు. 140–3 సర్వే నెంబర్‌తో 2.74 ఎకరాల విస్తీర్ణం గల ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో శ్మశాన వాటిక స్థలంగా పేర్కొన్నారని తెలిపారు. శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మించి భవిష్యత్ తరాల కోసం కాపాడాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన అవసరం



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



అమ్మపాలెంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు, చిత్రంలో డీఈఓ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి తరం బాలలు సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, దీనికి ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని స్థానిక 28వ డివిజన్‌లోని రామలింగేశ్వర నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యప్రకాష్‌రావు సూచించారు. సోమవారం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల్లో సంక్రాంతి పండుగకు ఒక విశిష్ట స్థానం ఉందన్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు పంట చేతికొచ్చి ఇంటికి తీసుకొచ్చే రోజులు సంక్రాంతి రోజుల్లోనే వస్తాయని, అవే దేశానికి ఆకలి తీర్చే ఆహార ధాన్యాలని వివరించారు. సంక్రాంతి పండుగ అంటే భోగి మంటలు, డూడూ బసవన్నల సందళ్లు, హరిదాసుల మేల్కొలుపులు వంటి ఆచారాలను చూడవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులకు భోగి పండ్లు పోసి వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు భూక్యా రాము, వై.రాధిక, డి.భాగ్యలక్ష్మి, టి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను తెలుసుకోవాలి

పెదవేగి : తెలుగు వారి సంప్రదాయాలు ప్రతిబింబించే సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ చెప్పారు. సోమవారం పెదవేగి మండలం అమ్మపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కొప్పాక ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు వైభోపేతంగా నిర్వహించారు. డీఈఓ శ్యామ్‌సుందర్, ఎంఈఓ–2 అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 అరుణ్ కుమార్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులను అభినందించారు. కొప్పాల పాఠశాల హెచ్ఎం ఆర్ శైలజ, ఉపాధ్యాయులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. పినకడిమి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పెదపాడు మండలంలో..

పెదపాడు: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వట్లూరులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వట్లూరులో నిర్వహించిన వేడుకలలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు పాల్గొని చిన్నారులకు భోగి పండ్లు పోశారు. అనంతరం భోగి మంటలను వెలిగించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	15	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	20	బీన్లదిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	54
బెండకాయలు	52	ములక్కాడలు	10–15
పచ్చిమిర్చి	40	కంద	60
కాకర కాయలు	60	బీట్‌రూట్	30
బీరకాయలు	--	కీర దోస	34
బీరకాయలు (పందిరి)	68	ఫ్రెంచ్‌బీన్స్	64
క్యాబేజీ	24	అల్లం	128
క్యారెట్	44–50	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25–30	తోటకూర	10
గోరుచిక్కుడు	44	గోంగూర	08
దోసకాయలు	34–44	పుదీనా	05
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	16
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్ఈఎల్	22.15	4822	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	రద్దు

పేదల పెన్నిధి సీఎం జగన్



వేగవరంలో పింఛను సొమ్ము అందిస్తున్న కొఠారు రామచంద్రరావు, సర్పంచ్ నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: అన్ని వర్గాల పేదల పాలిట పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రూ. 3 వేల పెన్షన్ ప్రతి నెలా అందిస్తూ ఇంట్లో పెద్ద కొడుకులా అందరి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం వేగవరంలో వృద్ధాప్య పింఛన్లు బెజవాడ చంద్రమ్మకు, ప్రత్యేక అవసరాల పెన్షనర్ల్ బేతపూడి లక్ష్మీబాకు కొఠారు రామచంద్రరావు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంటేటి గంగాధరబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, ఏనుగు రామాంజనేయులు, నాయకులు తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, నిట్టా గంగరాజు, మోర్లపద్దయ్య తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం

పెదపాడు: పాతముప్పర్రులో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలల రక్షణాధికారి రాజేష్ చట్టాలను వివరించి బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని అన్నారు. క్రాప్ ఎన్‌జీవో ప్రతినిధి ఎస్ రవిబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది మహిళా సంరక్షణ కార్యదర్శి ఏ మహాలక్ష్మి, ఏఎన్ఎం శిరీషా, ఎంఎల్‌హెచ్‌పీ పులవర్తి బన్ను, ఉపాధ్యాయులు టీ రాట్నాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్డు మరమ్మతులు

దెందులూరు: ఉంగుటూరు నుంచి చింతలపూడి నియోజకవర్గాల మధ్య ఉన్న గ్రామాల పరిధిలో 48 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతుకు ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మరమ్మతులు పూర్తి చేశారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు లక్కవరం ఎంపీటీసీ డీ.మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్ పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లి ప్రసాద్‌రెడ్డి, చేబ్రోలు నుంచి దేవులపల్లి వరకు రోడ్లను ఆధునికీకరించాలని కోరడంతో వెంటనే ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మేర మరమ్మతులు పూర్తి చేశారని తెలిపారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నేతలకు వివరించారు.

'ఆడుదాం ఆంధ్ర' యువతకు వరం

దెందులూరు: ఆడుదాం– ఆంధ్ర కార్యక్రమం యువతకు వరమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం శ్రీరామవరంలో యువతకు ఆడుదాం – ఆంధ్ర క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గ్రామ శివారు పట్టణ ప్రాంతాల్లో ఉన్న యువత ఎంచుకున్న లక్ష్యాలను ఎంచుకునేందుకు వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని అన్నారు. యువతలో ప్రతిభను గుర్తించడం, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ఆడుదాం ఆంధ్ర లక్ష్యమన్నారు. ఉపసర్పంచ్ కనుమూరి సావిత్రి, దెందులూరు గ్రామ కార్యదర్శి ఏఎస్ చౌదరి ఉన్నారు.

కోడిపందేలు, పేకాటపై ప్రత్యేక నిఘా



కొత్తూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చల్లా కృష్ణ

దెందులూరు: కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఏలు, తహసీల్దార్, ఎస్సై, సీఐలకు సమాచారాన్ని అందించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎస్సై కె.స్వామి కోరారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోడిపందేలు, పేకాటను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏ, గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల నుంచి మండల, జిల్లా అధికారులు నిరంతర తనిఖీలతో పాటు ప్రత్యేకాధికారులు ఫ్లెయింగ్ స్క్వాడ్‌లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా కోడిపందేలు, పేకాట జరగకుండా గ్రామ స్థాయి ఉద్యోగులు తమ వంతు తోడ్పాటు ఇవ్వాలని ఎస్సై స్వామి కోరారు.

పెదపాడు: కోడిపందేలు, పేకాట, గుండాట వంటివి నిషేధమని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. పెదపాడు మండలంలోని తోటగూడెంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

గణపవరం: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గణపవరం సీఐ సుభాష్ అన్నారు. గణపవరం మండలం పిప్పరలో గ్రామ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎస్సై, గ్రామ రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.